క్లుప్తంగా

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం)లో శనివారం నిర్వహించిన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. వివిధ రకాల పుష్పాలతో తయారు చేసిన అందమైన బతుకమ్మలతో పెద్దసంఖ్యలో తరలివచ్చిన మహిళలు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ చేసిన నృత్యాలు అలరించాయి. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బరావు, నోముల శివకుమార్, యర్రా శ్రీనివాసరావు, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.అదేవిధంగా పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ బి.సరిత, ప్రిన్సిపాల్ బి.సురేష్, డైరెక్టర్ జ్వాలిత్ సాయి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశుపోషకులకు సూచనలు



వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు):మండలంలోని వెంగనాయకునిపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడుతూ శిబిరంలో భాగంగా పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేసినట్లు తెలిపారు. 65పశువులకు చికిత్సలు చేయటంతోపాటు పశుపోషకులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ అందించినట్లు వివరించారు. పశుపోషకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమన నరసింహారావు, డీఎల్‌డీఏ డిప్యూటీ డైరెక్టర్ కె శ్రీనివాసులు, నందిగామ డివిజన్ డీడీ డా.మోసెస్‌వెస్లీ, ఏడీ కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, పశువైద్యులు ప్రభు, రైతులు పాల్గొన్నారు.

వెండితాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి శనివారం గుంటూరుకు చెందిన వడ్డంపూడి శివరామారావు, లక్ష్మీనరసమ్మ దంపతులు రూ.20,001 విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా ఆందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ పభ్యులు బి.శ్రీనివాసరావు, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట):పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు లింగాకర్షక బుట్టలకు ప్రాధాన్యతనివ్వాలని కెవీకె కోఆర్డినేటర్ కృష్ణంరాజు సూచించారు. గ్రామంలోని కెవీకెలో శనివారం పత్తిపంటలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంటలో ఎక్కువగా గులాబీ రంగు పురుగు ఉంటుందని రైతులు లింగాకర్షక బుట్టలను వినియోగించి నివారించుకోవాలని సూచిచంఆరు. ఈ బుట్టలను కెవీకెలో వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనా 18వ విడత పథకం మంజూరు ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రెసిడెంట్ బొడ్డు మల్లికార్జున్, వేంపాంగు రాజా, శాస్త్రవేత్తలు రాజు, వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కంచికచర్ల : బైక్‌పై పరిటాల నుంచి కంచికచర్లకు వచ్చే క్రమంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధన్వంత్, అచ్చి ఫణికుమార్ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బోనగిరి రాజు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మోటార్లకు వరద దెబ్బ

- మరమ్మతులకు గురైన 1000కి పైగా వ్యవసాయ మోటార్లు
- 100 వరకు మోటార్లు కొట్టుకుపోయిన వైనం
- పనిచేయని వ్యవసాయ బోర్లు
- ఎండుతున్న పంటలు
- రైతులకు తీరని నష్టం



పెనుగంచిప్రోలు వద్ద వ్యవసాయ మోటారుకు మరమ్మతులు చేయిస్తున్న రైతులు



అనిగండ్లపాడులో నీరు అందక నెర్రెలిచ్చిన మాగాణి



వరదలకు అనిగండ్లపాడు వద్ద కూలిపోయిన మోటార్ షెడ్

పెనుగంచిప్రోలు: గతనెల మొదటివారంలో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు మునేరు, వాగులు పొంగిప్రవహించడంతో వేలాది ఎకరాలు పంటపొలాలు నీటమునగా, వ్యవసాయ పొలాల్లోని బోర్లు, మోటార్లు సైతం దెబ్బతిన్నాయి. ఈ వరదలకు పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మునేరు, తువ్వకాలువ, వాగుల పక్కనన్న పొలాల్లోని 1000 మోటార్లు వరకు మరమ్మతులకు గురయ్యాయి. వరద ఉధృతికి 100కుపైగా మోటార్లు కొట్టుకుపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఇక మోటార్ షెడ్లు పడిపోగా, ఇసుక మేట మేయడంతో వ్యవసాయబోర్లు సైతం పూడికుపోయాయి. దీంతో రైతులకు తీరనినష్టం వాటిల్లింది.

ఇసుక మేటకు అందని పరిహారం...

ఇసుక మేట తొలగింపు, భూమి కోతకు గురైన పొలాలను సరిచేసుకునేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. పంట నష్టపోయిన పొలాలకు ఎకరానికి రూ.10వేలు చొప్పున పరిహారం అందించిన ప్రభుత్వం, మేట తీసుకునేందుకు, కోతకు గురైన భూముల మరమ్మతులకు ఇప్పటివరకు పరిహారం అందజేయలేదు. ఇసుకమేట, భూమి కోతకు గురికావడానికి సంబంధించి నష్టపరిహారం అందించే విషయంలో ఇప్పటికే జీవో జారీచేసిన ప్రభుత్వం, పరిహారాన్ని బాధితులకు అందించే విషయంలో మాత్రం జాప్యం చేస్తూనే ఉంది.

ఎండిపోతున్న వరి...

వరదలకు పొలాల్లోని వ్యవసాయ బోర్లకు సంబంధించిన మోటార్లు పనిచేయకపోవడంతో నీటితడులు పెట్టే పరిస్థితిలేకపోవడంతో పలు గ్రామాల్లో వరి పంట ఎండిపోతోంది. వరదలకు దెబ్బతినగా మిగిలిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. మోటార్లు కొట్టుకుపోవడం, మరమ్మతులకు గురైన నేపథ్యంలో నీటితడులు పెట్టకపోవడం మాగాణి పొలాలు నెర్రలిచ్చాయి. ఆయా పంటలను కాపాడుకునేందుకు రైతులకు అనేక వ్యయప్రయాసలు తప్పడం లేదు.

రైతులపై అదనపు భారం...

వరదలకు పంట దెబ్బతినడంతో నష్టపోయిన రైతులకు ఈ బోర్లు దెబ్బతినడం, మోటార్లు కొట్టుకుపోవడం అదనపు భారంగా మారింది. వరద ఉధృతికి వందలాది ఎకరాల పొలాల్లో ఇసుక మేట వేసిన నేపథ్యంలో ఈఏడాది ఆపొలాల్లో పంటలసాగుకు అవకాశమే లేదు. మిగిలిన పంటను కాపాడుకుందామంటే పొలాల్లో మోటార్లు మొత్తం మరమ్మతులకు గురికావటంతో నీరుపెట్టేందుకు వీలులేక పంట ఎండి పోతోందని రైతులు వాపోతున్నారు.కొట్టుకు పోయిన మోటార్ల ధర ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 వేలు వరకు ఉంటుంది. ఒక్కో మోటార్ మరమ్మతులకు ప్రస్తుతం రూ.5నుంచి రూ.10 వేలు అదనంగా ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. వరదలకు కొట్టుకుపోయిన మోటార్లకు బదులుగా ప్రభుత్వం సబ్సిడీపై మోటార్లను అందజేయాలని, మోటార్ మరమ్మతుల కోసం పరిహారాన్ని అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మరమ్మతులకు రూ.5వేలు ఖర్చు..



మునేరు వరదకు ఎకరం పొలంలో మొత్తం ఇసుక మేట వేసింది. వ్యవసాయ మోటారు నీటమునిగి పనిచేయడం లేదు. మోటార్ మరమ్మతులకు రూ.5వేలు ఖర్చయ్యాయి. ఈ వరదలకు దారుణంగా దెబ్బతిన్నాం.

–చింతల రామకోటి, పెనుగంచిప్రోలు

పంటపొలం ఎండిపోయింది..



వరదల కారణంగా కౌలు చేస్తున్న మూడు ఎకరాల్లో ఇసుక మేట వేసింది. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టాను. మోటార్లు పనిచేయకపోవడంతో నీరు పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో మిగిలిన పంట ఎండిపోయింది. మోటార్ల మరమ్మతులకు రూ.10వేల వరకు ఖర్చయింది.

–అరికట్ల వెంకటేశ్వర్లు, పెనుగంచిప్రోలు

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

నందిగామ టౌన్: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం ఈనెల 13వతేదీ వరకు దసరా సెలవులను ప్రకటించిందన్నారు. కానీ కొందరు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైతన్య, నారాయణ వంటి ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్నాయని, విద్యాశాఖాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఉపాధి గ్రామసభలు

జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం, బండిపాలెం, అనుమంచిపల్లి గ్రామాల్లో ఆదివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో 2023–24లో చేపట్టిన ఉపాధి హామీ పనులను సమీక్షించనున్నట్లు ఆయన వివరించారు .

నీటివరల్లో పడి బాలుడి మృతి

కంచికచర్ల : ప్రమాదవశాత్తు నీటి వరల్లో పడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన కంచికచర్లలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అరుంధతీనగర్‌కు చెందిన జల్లి కార్తీక్(4) ఆడుకుంటూ వెళ్లి ఇంటి సమీపంలో ఉన్న నీటి వరల్లో పడిపోయాడు. గమనించిన బంధువులు, కుటుంబసభ్యులు చూడగా అప్పటికే మృతిచెందాడు. బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాలుడి మృతి విషయం తెలుసుకున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సంఘటనాస్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కార్తీక్ మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. బాలుడి తల్లిదండ్రులను పరామర్శించి వారిని ఓదార్చారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



పేట విశ్వబ్రాహ్మణబజార్‌లో ప్రత్యేకాలంకరణలో దుర్గమ్మ



శివాలయం వద్ద గుహ సెట్టింగ్‌లో ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి



నందిగామలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



శంభులింగేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు



పెనుగంచిప్రోలు తూర్పుబజారులో శ్రీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మ అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి, జయంతిపురం, షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, అనుమంచిపల్లి, బండిపాలెం, గౌరవరం, బలుసుపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ముక్త్యాల, తిరుమలగిరి గ్రామాల్లోని భవానీ ముక్తేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలలో అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం, విశ్వబ్రాహ్మణబజార్, శివాలయం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం పట్టణంలో పలు ఆలయాలలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.స్థానిక నకాశిబజారు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మహంకాళి రామప్పశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమం, కుంకుమ పూజలు చేశారు. అద్దాలబజారు శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో గోపూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గాపురం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా అలంకరణలో దర్శనమివ్వగా అర్చకులు చింతా శివరామశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, చండీ హోమం నిర్వహించారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, మార్కండేయ బజారులో యూత్ వారు ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణ దేవిగా, అద్దాలబజారు శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆనందసాయి ఆలయంతోపాటు అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో శనివారం పెనుగంచిప్రోలు తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పడమట బజారు బీసీకాలనీలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం. నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నందిగామ, చందర్లపాడు మండలాల్లో కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అంబారుపేట సత్యమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాద్ పర్యవేక్షణలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తిపీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకులు అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాల్లో పార్వతీ మాతకు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.నందిగామ పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు గాయత్రిదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్ల వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవిగా, పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమ్మవారిని దుర్గాదేవిగా, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గనిఆత్కూరు, గొట్టుముక్కల, పేరకలపాడు, మున్నలూరు, కునికెనపాడు, వేములపల్లి, చెవిటికల్లు తదితర గ్రామాల్లో అమ్మవార్లకు భక్తులు పూజలు నిర్వహించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి ఆలయంలో వేంచేసియున్న అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వెల్లంకి మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



పేట శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



పేట మార్కండేయబజారులో శ్రీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు



కంచికచర్లలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



వీరులపాడు మండలం అల్లూరులో అమ్మవారు

సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర కీలకం



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న బి కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ వారి ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర విశిష్ట విద్య సేవా పురస్కార వేడుకలను నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి విశిష్ట విద్యా సేవా పురస్కారాల గ్రహీతలకు ఆవార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆవార్డులు స్వీకరించిన వారికి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా మహిళ అధ్యక్షురాలు తన్నీరు సుధారాణి, ఎంఈవోలు చిట్టిబాబు, నాగరాజు, అసోసియేషన్ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ కాలేషా, అసోసియేషన్ ప్రతినిధులు గొల్లపూడి మోహన్‌రావు, చుంచు రమేష్, పెంట్యాల బాలాజీ, కొమరగిరి భరద్వాజ్, ప్రతాప్‌రెడ్డి, మండడపు సుధీర్, బొల్లా రామారావు, వల్లాపురపు వెంకటబాబు, రత్నం, నారాయణ రావు,ఏసుబాబు, బోబెన్, వివిధ రాష్ట్ర, జిల్లా, డివిజన్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీసులో ప్రజాదర్బార్

ఎమ్మెల్యే తీరుపై విమర్శలు



ప్రజాదర్బార్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

కంచికచర్ల : స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రణీతకాలనీ, ఇందిరా కాలనీల్లో రోడ్లు, డ్రైయినేజీలు సక్రమంగా లేవని, పింఛన్లు మంజూరు చేయించాలని కోరుతూ స్థానికులు అర్జీలు అందజేశారు. ఆయా అర్జీలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఐ చవాన్, పీఆర్ ఏఈఈ రవికుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ ఆఫీసులో ప్రజాదర్బార్‌పై విమర్శలు..

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజాదర్బార్‌ను టీడీపీ ఆఫీసులో నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపించాయి. ఎమ్మెల్యేగా పార్టీలకతీతంగా నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని పార్టీ ఆఫీసులో నిర్వహించడంతో అధికారపార్టీకి చెందిన వ్యక్తులకు చెందిన కార్యక్రమంగా మారిపోయిందనే గుసగుసలు రాజకీయవర్గాల్లో వినిపిస్తున్నాయి. పార్టీ ఆఫీసులో నిర్వహించిన కార్యక్రమానికి అధికారులు కూడా హాజరుకావడంపై ఇదేమి విడ్డూరమంటూ జనం చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహిస్తే పార్టీలకతీతంగా అందరూ వచ్చి ఆయా సమస్యలపై అర్జీలు అందించే అవకాశం ఉండగా, టీడీపీ ఆఫీసులో నిర్వహించడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని కంచికచర్ల వాసులు కోరుతున్నారు. అయితే టీడీపీ ఆఫీసుకు కూతవేటు దూరంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం గమనార్హం.

ఎల్‌ఓసీ మంజూరుపత్రం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 12వ వార్డు ధనంబోడు కాలనీకి చెందిన రామిశెట్టి వెంకటకృష్ణ డయాలసిస్‌తో బాధపడుతూ విజయవాడలోని స్వర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.50 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) జారీచేసింది.బాధిత కుటుంబసభ్యులకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శనివారం బాధిత కుటుంబసభ్యులకు ఎల్‌ఓసీ మంజూరుపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వేదులాపురి అలేఖ్య సైదా, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కేవీ ఇనిస్టిట్యూట్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థినులు

కంచికచర్ల : కంచికచర్లలోని కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీలో శనివారం ఫ్రెషర్స్ వేడుకలను నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ అధినేత కేవీ కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థినుల ఫ్యాషన్ షో ప్రత్యేకాకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, మహర్షి విద్యా సంస్థల అధినేత షేక్ ఖాసీం, డాక్టర్ ఫణికుమార్, పారిశ్రామికవేత్త నాగళ్ల కోటేశ్వరరావు(కోటిబాబు), గుదే నాగవరప్రసాద్, ముక్కెర అజయ్‌కుమార్, జాఫర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తుల ఆగ్రహంతో దిగివచ్చిన ఆలయ అధికారులు



నందిగామ టౌన్: నందిగామ పట్టణంలోని శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో దశాబ్దాలుగా ఆచరిస్తున్న సంప్రదాయాలను ఆలయ అధికారులు విస్మరించడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఎట్టకేలకు ఆలయ అధికారులు దిగివచ్చారు. పూర్వ ఆచారం ప్రకారం మునేటి నుంచి జలబిందెలతో నీటిని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేయాలి. జలబిందెలకు పట్టణంలోని యాదవుల బావివద్ద అలంకారం చేసి మేళతాళాలతో ఆలయానికి తీసుకురావాల్సి ఉంది. మునేరులో నీరు పరిశుభ్రంగా ఉండవనే ఉద్దేశంతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, అధికారులు పూర్వ ఆచారాలను పక్కనబెడుతూ ఆలయంలోని బావి నుంచి నీటిని తెచ్చి రెండురోజులుగా అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై ఆలయ అధికారులు, వ్యవస్థాపక ధర్మకర్త తీరుపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్వ ఆచార సాంప్రదాయాల ప్రకారం ఉత్సవాలను నిర్వహించాలని ఆలయాధికారులను నిలదీశారు. దీంతో దిగివచ్చిన ఆలయఅధికారులు, వ్యవస్థాపక ధర్మకర్త పూర్వసంప్రదాయం ప్రకారం శనివారం మునేటి నుంచి జలబిందెలను తీసుకువచ్చి మేళతాళాలతో ఆలయంలో అభిషేకం నిర్వహించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com